

# మరిసేవో, మళ్ళెలేగా!

చిరంజీవి

సాధారణ
దీపావళి కథల పోటీలో
మొదటి బహుమతి
పొందినది

పండు ముత్తయిదువు నుదుటి బొట్టు లాంటి పొద్దు పడమటికి జారిపోయింది. దేవుడి మాన్యంలో కౌలుదారు రాంసామి నాటు తోలు తున్నాడు. రెండేళ్ల క్రితం దాకా బీడుగా పడి ఉన్న ఈ మడి



చెక్క తన చేతికొచ్చింది. రెండేళ్లలో వదుసూ పదుసూ వేశాడు. కూరా నారా వేసి, మళ్ళు చేసి, ప్రాణం పోసి పెంచాడు. కూరగాయలు నవనవ లాడుతూ తొలికోతకి తయారుగా ఉన్నాయి. వాటికేసి చూస్తుంటే అతని కళ్లు అప్పుడే పిండిన పాల చెంబుల్లా, తృప్తిగా పొంగులు వారుతున్నాయి. తడి అవగానే కాయలు కోయాలి. తెల్లారేసరికి సంతకి తీసుకుపోవాలి. రూపాయల్ని కళ్ల చూడాలి. ఊహాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న రాంసామికి బావి

పక్కనే అరటి గెల కనిపించింది. పంటకు తయారై పై హస్తం పండింది కూడా.

"అయ్యోయ్, నా కో అరటి పం డివ్వవ్?" అనడిగింది అయిదేళ్ల కూతురు హేమ.

"అట్టాగే, తల్లీ! ఆ గెలంతా నీకేగా! రేపటి కింకా బాగా మగ్గు తుంది. అపుడు తినచ్చులే!" అన్నాడు కన్న తండ్రి.

"ఊఁ ఎప్పుడూ రేపే అంటావు నువ్" అంటూ హేమ కుదురులోంచి మల్లెమొక్క తవ్వి తీసింది. దాన్ని తీసుకుని కంచెదరి మ్రరిచెట్టు కేసి పరుగు తీసింది. కూతుర్ని చూస్తుంటే రాంసామికి మూడేళ్ల నాడు చచ్చిపోయిన పెళ్ళాం గుర్తుకొచ్చింది. 'పుట్టి పెరి గిన ఇన్నేళ్లకి తన బతుక్కి మంచి రోజులు వస్తున్నాయి. ఏం లాభం? అనుభవించే అదృష్టం ఆ ఇల్లాలికి లేకపోయింది!'

బావిమీది అడ్డ వెట్టె కిరకిరలాడు తూంది. అంచు నున్న నేలతంగేడు మీద ఉడత బెదురుతూ తిరుగు తూంది. తొండంలోంచి బోదెలోకి జారే నీళ్ల మల్లే అతని ఆలోచనలు గలగల లాడుతున్నాయి.

'ఆ ధర్మకర్త బాబు పుణ్యమా అని తన కీ మడిచెక్క కౌలుకి దొరికింది. కూతురికి ఆ బాబే హేమ అని పే రెట్టాడు. తనంటే, కూతురంటే ఎంత దయ! ఎంత ప్రేమ! తన కడుపున పుట్టిన బంగారం హేమ! చేతుల్లో పెరిగిన బంగారం ఈ కూరగాయల తోట! అంతా ఆ బాబు చలవ! తలుచు కుని చేయెత్తి మొక్కాలి. పేరు చెప్పుకుని దీపమెట్టాలి! గుళ్లో దేవుడు, ఊళ్లో బాబు చల్లగా చూస్తే చాలు, హేమని చదివిస్తాడు. చదువుకున్న వాణ్ణి తెచ్చి పెళ్లి చేస్తాడు.' ఇలా ఊహలు ముసిరేసరికి రాంసామి చెవుల్లో సన్నాయి మోగింది. కళ్లు తడిసి తరిపి వెన్నెల్లా మిలమిలలాడాయి. కొబ్బరి మట్టలు గాలికి కదిలి గలగల మన్నట్లు పెద్దగా నవ్వులు వినిపించే సరికి రాంసామి ఉలిక్కిపడి చూశాడు. ధర్మకర్త బాబే! హేమ భుజం తడుతూ నవ్వుతున్నాడు. అంత నిండు మనిషి కూడా నరుగుడు మొక్కలా ఊగిపోతున్నాడు.

"అయ్యా! దండం, దండం!" రాంసామి కాడి విప్పి మ్రరిచెట్టువైపు పరిగెత్తాడు.

"చూడవయ్యా, రాంసామీ! చిన్నారి హేమ ఎన్ని తిప్పలు పడు తూందో? మ్రరిచెట్టు నీడలో పచ్చ గడ్డి పరకైనా మొలవదే? మల్లె మొక్క ఎలా బతుకుందయ్యా?" అన్నాడు ధర్మకర్త.

"చిత్తం. చిన్నదాని కేం తెలుస్తుం దయ్యా!" చేతులు నిసుక్కున్నాడు రాంసామి. ధర్మకర్త హేమ చేయి పుచ్చుకుని బావివేపు సాగాడు. రాంసామికి కిందా మీదా తెలీకుండా ఉంది.

"రాంసామీ! అహా, ఏం సొగసుగా ఉందయ్యా తోట! వంగ, బెండ, బీర ... రే ... సొరకాయలు దండిగా కాసినట్టున్నాయి?"

"చిత్తం. అంతా తమ దయ, బాబయ్యా!"

"చూడు, రాంసామీ! నా దేముంది, చెప్పు? అంతా ఆ గుళ్లో ఉన్న వేణు గోపాలుడి దయ. నేను నిమిత్త మాత్రుణ్ణే!"

"అట్టాకాదులే, బాబూ! ఊరుకాని ఊరువాణ్ణి. తమ కాళ్ల కడ్డం పడ్డాను. ఊళ్లో ఇంతమంది ఉన్నా నాకే కౌలు కిప్పించారు! తమ దయే లేకపోతే నే నేమైపోయేవాణ్ణో!" వినయంతో రాంసామి నడుం వింటిబద్దె అయింది.

"ఊరికే పొగడకు, రాంసామీ! అన్నట్లు ఊళ్లో అందరూ ఏమను కుంటున్నారో విన్నావా? అయినా, అటు రావటానికి నీకు తీరి కెక్కడుం దిలే?"

"చిత్తం. ఊళ్లోకొచ్చి చాల రోజు లయిందండి!"

"నీకూ, నాకూ ఒకటే కంచం, మంచం అంట! అంత స్నేహితుల మని — ఊరంతా అనుకుంటున్నారు, తెలిసిందా?"

"అయ్యా! తమ రెక్కడ? నే నెక్కడ?"

"అదే అనవద్దన్నాను. మనలో మనకి ఎక్కువేమిటి? తక్కువేమిటి? ఒక ళ్లనే దేమిటి? నిజంగానే మనం స్నేహితులం. నీవు కాదంటావా, చెప్పు?"

"ఎంత మాట, బాబూ! ఎంత మాట!"


"రాంసామీ! పరాయి చోట పాదం పెట్టే అలవాటు లేదు. వెడితే గుడికి, వస్తే నీ దగ్గరికి — అంతే! రే....అరటి గెల కూడా తయా రయిందే — భేష్!"

"చిత్తం, బాబూ!"

"గుర్తు కొచ్చింది. నిన్న రాత్రి నాకూ, మా ఆవిడకీ పెద్ద దెబ్బలాటయి పోయిం దనుకో!"

"అయ్య బాబూ! — అదేమిటి?"

"నీ సంగతి, హేమ సంగతి పట్టించుకోడం లేదని నన్ను చివాట్లు వేసింది."



కాంతి చక్రం ఫోటో—ఎస్. ఎన్ రావు (మద్రాసు-28)

**పగతో పాలు తాగించడం కూడా కష్టమే కాని ప్రేమతో విషం తాగించడం సులభం. ప్రపంచంలో అభాగ్యులు, అదృష్ట హీనులు ఎందరో ఉన్నారు. భవిష్యత్తులో ఏదో మంచి జరుగుతుందన్న ఆశతో ప్రాణాలు నిలబెట్టుకొంటూ ఉంటారు. ఏమాత్రం మంచి కనుపించినా దాన్ని ఆశ్రయిస్తారు. ఆ మంచి కాలసర్పమై కాటు వేస్తుం దని కానుకోలేరు.**

"అయ్య! అమ్మగారు అచ్చం దేవత కదండీ!"

"అసలు సంగతి నీకు చెప్పలేదుగా! ఇంటి విషయాలు నీకు తప్ప మరెవరికీ చెప్పను సుమీ! నీళ్లోసుకుంది. మూణ్ణెల్లు!"

"చల్లని కబురు చెప్పారు, బాబూ! తమరికి దోసపండంటి కొడుకే పుడతా డండి, నా మనసు చెబుతోందండి."

"నా మాటే నీకూ వచ్చింది. చూశావా, మన ఇద్దరిదీ ఒకటే మనసూ, ఒకటే ఆలోచన!"

"చిత్తం, బాబూ!"

"తెల్లారగట్టే ఊరి కెళ్లాలి! నేనూ, ఆవిడా వెళ్లాలి. ఆ సంగతి నీకు తెలీదా? నీకేం అదృష్టవంతుడివి, రాంసామీ! ఏ బాదరబందీ లేదు. మా ఆరో మరదలి పెళ్లి. మనం ఉత్త చేతులతో వెళితే నలుగురు నవ్వుతారు! నగలు, నాణాలు మన వల్ల కాదు. కట్నాలు, కానుకలు అందరూ ఇచ్చేవే! మా ఆవిడ కో ఉపాయం తట్టింది. పెళ్ళికి కావలసిన కూరగాయలు పట్టుకు పోదా మంది. భేషుగ్గా ఉంది అన్నాను. అన్నానే కాని, తీరా బయలు దేర బోయేసరికి ఎక్కడున్నాయి? ఎవ ర్నడగాలి? ఎవ్వడగాలి. లోకు ల్నడగాలి. నావల్ల కా దన్నాను. ఇక చూడు,

రాంసామీ! ఒకటే గొడవ... ఆవిడ అసలే పట్టే మనిషి కాదేమో..."

ధర్మకర్త బాబుగారికి వచ్చిన 'ఆపద' విని రాంసామి గుండె చెరువయింది. "అదేమిటి, బాబూ, అట్లాగన్నారు? అమ్మగారి మాట కాదంటే బాగుంటుందా? ఈ తోట ఎవరిది, బాబూ? తమరి కష్టమేమిటి?" అన్నాడు రాంసామి.

"నువ్వలా అంటావని తెలిసే వచ్చానంటావా? తెలుసు, రాంసామీ, తెలుసు! నేను ఖరీదు ఇస్తానవడం బావుండదు! నీవు పుచ్చుకోవడమూ అంతకంటే బావుండదు. ఈ చిక్కుముడి విప్పే దెలా?"

"తమ రట్లాంటి ఆలోచనల్ని రానీకండి, బాబూ!"

రాంసామి వద్దన్నా, బతిమాలినా వినక ధర్మకర్త బాబు నడుం కట్టి కూరగాయలు దులపడంలో సాయపడ్డాడు. తనతో కబుర్లాడుతూ, నడుం వంచి పనిచేస్తున్న బాబుని చూసి రాంసామి తెగ ముచ్చటపడ్డాడు. గుడిసెలో ఉన్న ఒక్క గోతాం తెచ్చాడు. అది వాన వచ్చినప్పుడు నెత్తికేసుకొనే గోతాం. దాని నిండా కూరగాయలు నింపి మూట బిగించాడు.

"మూట తీసెయ్యకుండా మూట కట్టావు. నా బెంగ తీరింది, రాంసామీ! అమ్మగారు సంతోషిస్తుంది. అసలే పట్టేమనిషి కాదుగా! మరేం లేదు... అరటి గెల ..."

"ఉండండి, బాబూ, దాన్నీ దించుతాము!"

ధర్మకర్త చాల మొగమాటపడ్డాడు. ఆయన నోటంట మాట రాకముందే రాంసామి గెల దించి చాలా సంతోషన్ని కలిగించాడు. నిజమైన స్నేహానికి ఇదే గీటురాయి అన్నాడు ధర్మకర్త. రాంసామి మూట నెత్తినెత్తుకుని, గెలని చేతికి కిరికించుకుని ధర్మకర్త వెంట ఊళ్ళోకి బయలుదేరాడు. ధర్మరాజ స్వర్గానికి వెళుతూంటే వెంటనున్న కుక్క గుర్తుకొచ్చింది ధర్మకర్తకి పైకనలేదు.

అరగంట క్రితం కళకళలాడిన ఆ తోట ఇపుడు ముసలమ్మ నోరులాగ బోసిపోయింది. సంజె చీకటి రాంసామి గుడిసెమీద నెమ్మదిగా పరుచుకుంది.

* *

ధర్మకర్త బాబుగారి మండువా లోగిట్లో దీపం వెలుగుతూంది. రాంసామి బరువు దించి చెమట తుడుచుకున్నాడు. ధర్మకర్తకి చాలా జాలేసింది. గబగబ చెంబెడు మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చాడు. రాంసామి గటగట తాగి, అలుపు తీర్చుకున్నాడు. లాంతరు మసక వెలుగులో ఇద్దరి ముఖాలు ప్రసన్నంగా ఉన్నాయి.

"చీకటిపడ్డా ఈవిడగారింకా చావిట్లోనే ఉందనుకుంటాను. ఒక్క అడుగేసి రా, రాంసామీ!"

రాంసామి సావిట్లోకి వెళ్ళబోతూ అరటి గెల వేపు చూశాడు. అరటి పండులా ముద్దుగా, బొద్దుగా ఉండే కూతురు చటుక్కున గుర్తు వచ్చింది. తల విదిలించుకుని చావిట్లో కెళ్ళాడు. ధర్మకర్త పై హస్తంలోంచి నాలుగైదు పళ్ళు తుంచి, రుచి చూశాడు. ఇల్లాలు మంగమ్మ వచ్చింది.

"ఏమో అనుకున్నాను కాని పళ్ళు మా చెడ్డ రుచిగా ఉన్నాయి. మాయదారి ఎరువు వేయకుండా పెంచాడేమో, ఎంత రుచిగా తయారయ్యాయో!" మగని మాటలు విన్నాక మంగమ్మ తనూ రెండు పళ్ళు తుంచి ఎంగిలి చేసింది.

"రాంసామి ఎక్కడ?"

"చావిడినిండా చెత్తా చెదా అలాగే పడి ఉంది. ఓ చెయ్యి వెయ్యరా బాబూ, అని పురమాయించాను. వచ్చేస్తాడు!"

"అతడు కనిపిస్తే సరి పని చెబుతావు నువు. సర్లే... వాడికి మనమంటే చచ్చే ప్రేమ. కడుపు కట్టుకొని మరీ చాకిరీ చేస్తాడు. ఊం! ఈ కూరగాయలు చూశావా! నీ చెల్లెలి పెళ్ళి వెళ్ళమారిపోతుంది!"

"ఈ బావగారి ఆపేక్ష ఆ మరదలికి అర్థమవుతుంది లెండి!" ఆలు మగలిద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

రాంసామి రావడం, ధర్మకర్తకి చిరుకోపం రావడం ఒక్కసారే జరిగింది. "చూడు, రాంసామీ! మామీద నీకు ఎంత ఆపేక్ష ఉన్నా, స్వంత విషయాల్లో ఉపేక్ష పనికిరాదు!" అయ్యగారి కోపం చూసి అర్భకుడు రాంసామి అదిరిపోయాడు. అతని కంగారు చూసి నవ్వి, భుజం తట్టి గోముగా- "ఇంత పొద్దుపోయే దాకా నువ్విక్కడ కాలక్షేపం చేస్తే, అక్కడ హేమా, తోటా ఎలా చెప్పు! పెందరాళే గూటికి చేరాలి. ఆ హేమ మాలాంటి వాళ్ళ ఇళ్ళలో పుట్టి పెరగవలసిన పిల్ల! సరే ... వెళ్ళు, వెళ్ళు! పనంటే సరి ప్రాణా లిస్తావు. వేళా గీళా అంతా మరిచే పోతావు!" అన్నాడు. అయ్యగారి మందలింపులు తియ్యటి తేనెజల్లులా రాంసామి గుండెల్ని తడిపాయి. కూతురి మాట వచ్చేసరికి ఆనందంతో ఉబ్బిబ్బయ్యాడు రాంసామి.

"నా కడుపున పుట్టిం దన్న మాటే కాని, తమరి నీడలో బతికి బట్ట కట్టిందయ్యా! తమ దయవల్ల అది నాలుగు ముక్కలు నేర్చుకోవాలయ్యా!"

"రాంసామీ! హేమ జాతకురాలు! నే చెబుతున్నాగా! అది తోటలో పుట్టినా కోటలో పాగా వేస్తుంది! వెళ్ళు! మనం మాటల్లో పడ్డామంటే కోడి కూసిన సంగతి కూడా మరుస్తాం! అన్నట్టు — వెళుతూ వెళుతూ బండి సాయిబుని కేకేసి పో! తెల్లారక ముందే బండి కట్టాలని చెప్పు!" అని పని పురమాయించి రాంసామిని పంపేశాడు ధర్మకర్త.

"ఇందాక పని చెప్పావని నన్ను మందలించారు. ఇపుడు మీరూ చెప్పారు!" అంది విస్మయంగా మంగమ్మ.

"చూడూ! నువు వాడికి పని చెబితే ఆ బాధ నా కర్థం కావాలి! నేనే చెబితే ఆ బాధ నీ కర్థం కావాలి! మనిషి గొప్పతనమల్లా ఎదటివాణ్ణి అర్థం చేసుకోవడమే! ప్రపంచాన్ని అర్థం చేసుకొన్నాను కనకనే నా తల కాస్త నెరిసిపోయింది."

"ఎంత బాగా చెబుతారండీ, అరటిపండొలిచి అరిచేతిలో పెట్టినట్లు!" మంగమ్మ మురిసిపోతూ రాగాలుతీసింది.

చటుక్కున జ్ఞాపకం వచ్చిన దానిలా, "పాపం, రాంసామి చాల మంచి ముండా కొడుకండీ!" అంది ఆత్మీయంగా.

"ఇపుడా నువు తెలుసుకుంది! ముత్యాలన్నీ ఒక చోట చేరతాయి. మంచివాళ్ళంతా ఒకచోటే ఉంటారు. ఈ ధర్మ రహస్యం తెలుసుకో మరి! సర్లే. ఎక్కువ ఆలోచించి ఆయాస పడకు! నువు అసలే పట్టే మనిషివి కూడా కాదు!" అన్నాడు ధర్మకర్త.

మంగమ్మ సంజవేళ జాజిమల్లెలా సిగ్గుపడిపోయింది.

* * *

మరదలి పెళ్ళికి వెళ్ళి మళ్ళీ వచ్చాక ధర్మకర్త బాబు ప్రతిరోజూ రాంసామి దగ్గర కొంటున్నాడు. రాంసామి ఇచ్చిన కూరగాయల్ని పెళ్ళికొచ్చిన చుట్టాలు ఎలా మెచ్చుకున్నారో...ఆ సంగతులు చెప్పింది చెప్పకుండా పది రోజులదాకా ధర్మకర్త చెబుతూంటే, రాంసామి విని మురిసిపోయాడు. ఏపుగా పెరిగిన మొక్కజొన్న కర్రలు విరిచి పొత్తులు తంపట వేసేవాడు. ధర్మకర్త తృప్తిగా ఆరగించేవాడు. కూరగాయలు రోజూ ధర్మకర్త ఇంటికి నడిచిపోయేవి! అక్కడ చావిట్లో పేరుకుపోతూన్న చెత్తా చెదా తీసి, రాంసామి గుట్టలేస్తూనే ఉన్నాడు. రోజు వెంట రోజు,

( తరువాయి 22వ పేజీలో )

వెలుగు రవ్వలు ఫోటో – ఎమ్. మల్లారెడ్డి (మద్రాసు–54)



# మ్రరి నీడా,

( 23 వ పేజీ తరువాయి )

నెలలు గడుస్తున్నాయి. రోజు రోజుకి ధర్మకర్త రాంసామిని తుమ్మబంకలా, బంకమట్టిలా, గోడమీద బల్లిలా అతుక్కుపోయాడు. వారి స్నేహం అపూర్వంగా బిగుసుకు పోయింది.

తోట కాపు ఉడిగింది. దానిలాగానే కోరికలు కూడా ఎండిపో

రాంసామి మతి లాగా కాలచక్రం తిరిగింది. మళ్ళా వేసవి వచ్చింది. అతడి గుండెలో, మాన్యం బావిలో కూడా తడి లేదు. మొన్నటి కాపు చేతికి దక్కకుండానే ఖర్చు అయిపోయింది. ఈ ఏటి కౌలు పైకం చచ్చిన పెళ్ళాం తాలూకు మిగిలిపోయిన ఒక్క నగా అమ్మి ధర్మకర్త చేతిలో పెట్టాడు. ముందుగానే కౌలుపైకం ఖచ్చితంగా చెల్లించినందుకు నలుగురి ఎదుటా రాంసామి నిజాయితీని ధర్మకర్త మెచ్చుకున్నాడు.

తను గంజినీళ్లలో పచ్చి మిరపకాయ కొరుక్కుని కడుపు నింపుకున్నాడు. కూతురికి ఒక్క గౌను కూడా కుట్టించలేక పోయినందుకు ఒకటి రెండు సార్లు కన్నీళ్లు పెట్టుకుని తుడుచుకున్నాడు. అనుకొన్నదేదీ చేయలేక పోయాడు. ఈ తడవ ఏమైనా సరే తోటకి పైసా వృథా కాకుండా రాబట్టుకోవా లనుకున్నాడు. కాలు కదపకుండా తోటలోనే పడి ఉండి మట్టిలో బంగారం తీయాలనుకున్నాడు. మెత్తగా దుక్కి పదును చేశాడు. గుడిసె కప్పు తిరగేశాడు. మోట అడ్డ పట్టె బాగుచేసుకున్నాడు. వాన కోసం ఎదురు చూస్తున్నాడు.

ఒక రోజున — కాకుల మందల్లే పొగ మబ్బులు పారాడాయి. రాంసామి కళ్లు చల్లబడ్డాయి. ఆ రాత్రి నిద్ర పట్టక దొర్లాడు. ఎరువు లేదు. చేతిలో పైసా లేదు. ఎరువు లేకపోతే ఎగసాయమే లేదు. అర్ధరాత్రి వేళ ధర్మకర్త బాబు గుర్తు కొచ్చాడు. తన చేతులతో పోగేసిన ఏభై, అరవై బళ్ల పేడా చెత్తా గుట్ట గుర్తు కొచ్చింది. అడగాలే కాని, ఆ బాబు అవు నంటాడు. ఈసారి కాపు చేతి కందినపుడు బాబు ఋణం తీర్చేయవచ్చు. ఓ పది బళ్ల చెత్త చాలు! రాంసామి హాయిగా నిద్రపోయాడు.

మంగమ్మ పూజ గదిలో ఉంది. కాఫీ పుచ్చుకుని ధర్మకర్త వరండాలోకి వచ్చాడు. నించున్న రాంసామిని చూసి ఆశ్చర్యపడ్డాడు.

"ఎంతసేపయింది వచ్చి? లోపలికి రాక ఇక్కడే చేతులు కట్టుకు నించున్నావేమిటి కథ?" అనడిగాడు ధర్మకర్త.

"చిత్తం. చిన్న పని తగిలి తమ దగ్గిరి కొచ్చాను!"

"నాతోనా? ... సరేకాని, హేమ బాగా ఉందా! నెల్లాళ్లయింది చూసి! ఈవిడ పట్టి మనిషి కాదయ్యె, గడప దాటడానికి వీల్లేకుండా ఉంది నాకు!"

"చిత్తం! దుక్కి దున్నేశానయ్యా, పైన మబ్బు లాడుతున్నాయి!"

"అవునవును. కౌలు పైకంకూడా ఇచ్చేశావుగా!"

"చిత్తం. ఇపుడు తమ సాయం కావాలయ్యా!"

"రాంసామీ! అలాంటి మాట అనద్దని ఎన్ని సార్లు చెప్పాను? మనం స్నేహితులం! నీ అంతవాడిని నువ్వు; నా అంత వాణ్ణి నేను!"


రాంసామి కడుపులో మెలి తిరుగుతున్న మాటల్ని గబగబ వెళ్లకక్కాడు. "అది కాదయ్యా! తమరు పది బళ్ల ఎరువు ఇప్పించాలి. కాపు చేతి కందగానే ఋణం తీర్చుకుంటానయ్యా! బయట కొందామంటే చేతిలో పైసా లేదు. ఇప్పు డెరువు వెయ్యకపోతే మా నోట్లో మట్టేనండి! తమ రాదుకుంటే నేనూ, హేమా తమ పేరు చెప్పుకుని గంజి తాగుతామండి!" బరువు తీరినట్లు నిట్టూర్చాడు రాంసామి.

అంతకుముందే వచ్చిన మంగమ్మ కూడా వింది.

తగలరాని చోట దెబ్బ తగిలినట్లు, ధర్మకర్త ఓ నిమిషం విలవిలలాడిపోయాడు. గొంతు పూడినంత పని అయింది. ఎంతో బాధతో, ఆవేదనతో రాంసామి భుజం తట్టి మరీ అన్నాడు: "రాంసామీ! అడగవలసి వచ్చేసరికి నువ్వూ, అడిగించుకోవలసి వచ్చేసరికి నేనూ ఎంత ఇరకాటంలో పడ్డామో చూడు మరి? ఇచ్చి పుచ్చుకోవడం వచ్చేసరికి ఎంత గొప్పవాళ్లయినా, మంచివాళ్లయినా మామూలు వాళ్ల మైపోతాం! నాకు లేక కాదు, నీకు ఇవ్వలేక కాదు. పెద్ద లేమన్నారు? ఇచ్చి కయ్యం తెచ్చుకో వద్దన్నారు! మన స్నేహం చెడిపోవడం నా కిష్టంలేదు. ఋణం ఇవ్వడం, పుచ్చుకోవడం మన స్నేహానికి నష్టం. అది మంచిది కాదు. ఒక మాట చెబుతా — బాగా ఆలోచించుకో! వా డున్నాడే — గుళ్లో వేణుగోపాలుడు — వాడే ఏదో ఒక దోవ చూపిస్తాడు. ఏమంటావ్?"

"చిత్తం, అయ్యా ... సెల విప్పించండి. వస్తా" అని వెళ్లిపోయాడు రాంసామి. అతనికి దోవ పొడుగునా చీకట్లు కమ్మాయి. 'ధర్మకర్త బాబు మాట కూడా నిజమేనేమో? కాని, తను ఎరువు తీసుకుంటే తప్పకుండా ఋణం తీర్చి ఉండే వాడే! నా తలరాత ఇలా ఉంది!' కాళ్లీడ్చుకుంటూ వెళ్లిపోయాడు రాంసామి.

ధర్మకర్త అలానే మాటా, పలుకూ లేకుండా నిలబడి పోయాడు. మంగమ్మ అంతరాంతరాల్లో ఎక్కడో 'పాపం,



అతనికి ఎరువిస్తే బాగుండేదేమో' అన్న ఊహ మినుకుమినుకు మంది.

"ఏమండీ! నోరు తెరిచి అడిగాడు. మనకే బోలెడంత ఉంది కదండీ'' అంది మంగమ్మ. అంతే.

"ను వ్వసలే వట్టి మనిషివి కావు. ఇలాంటి ధర్మ సందేహాలు బుర్రలోకి రానీకు. 'మనకి ఇంత ఉంది' అనుకో వడమే పెద్ద పొరపాటు. వట్టి అహం కారం. కృష్ణభగవానులు ఏమన్నారు? 'ఇచ్చే దెవరు? పుచ్చుకొనే దెవరు? చంపే దెవరు— చచ్చే దెవరు? సర్వం నేనే' అన్నాడు. పవిత్రమ్మైన స్నేహి తులం మేం. స్నేహాన్ని నిలువుకో మంటావా? లేక మానె డిచ్చి, జొనె డిచ్చి మట్టిలో కలుపుకోమంటావా? చెద లంటని నిప్పులాంటి మా బతుకులు ఇలాగే వెళ్ళిపోవాలి. ఋణం ఇచ్చినా, పుచ్చుకున్నా కుక్కో, నక్కో అయి పుట్టి తీర్చుకోవాలి. ఈ జన్మ ఇలాగే పర మాత్ముడిలో లీనమ్మై పోవాలి కానీ, మరో జన్మ సంగతి నా చెవిని పడ కూడదు...'' ఆయన ధోరణికి అంతూ దరీ కనబడలేదు.

"అబ్బ! తీగ కదిలించకుండానే డొంకంతా కదిలించా రండీ మీరు'' అంది మంగమ్మ.

"చూడు! ఇంట్లోకి పద. విల బడకు, నిండుమనిషివి'' అన్నాడు ధర్మకర్త ఆప్యాయంగా.

* * *

అమావాస్య. అర్ధరాత్రి. మిన్ను, మన్ను ఏకంగా కుంభవర్షం. మెరుపులు, ఉరుములు పందెలు బద్దలు చేస్తున్నాయి. గుడిసెలో రాంసామి దిగులుగా కూర్చున్నాడు. ఆకలి, ఆవేదన అతన్ని క్రుంగదీశాయి. ఎరువు దొరకలేదన్న బాధ, రేపటి గతేమిటన్న వేదనా అతనికి ఊపి రాడనీయడంలేదు. దూరంనించి—'రాంసామీ! రాంసామీ!' అన్న కేకలు విని తుల్లిపడ్డాడు. "నేనే, రాంసామీ!" అన్న కేక — ధర్మకర్త బాబుదని గుర్తించాడు. తికమకపడి తడిక తీశాడు. గొడుగు ముడిచి, ధర్మకర్త లోపలికి వచ్చాడు.

"ఏమిటి, బాబూ, అర్ధరాత్రి వేళ ఇటొచ్చారు?"

"మిన్ను విరిగి మీద పడింది, రాంసామీ! ఆపదలో ఆదుకొనే అప్పుడి వని పడుతూ లేస్తూ పరుగెత్తు కొచ్చాను!"

"ఏం జరిగింది, బాబూ?"

ధర్మకర్త గొంతు బొంగురు పోయింది. ఏడుపు ముంచుకు వస్తూంది.

"అమ్మగారి పని కిందా మీదాగా ఉంది. ప్రసవించలేక హైరాన పడు తోంది. నువు నిమిషాలమీద మానా పురం వెళ్ళి వైద్యుణ్ణి లాక్కొస్తే తప్ప ఆవిడ బతకదు. రాంసామీ! ఇంకా నిలబడే ఉన్నావా? నా ఇంటి దీపం నిలబెట్టు'' అంటూ రాంసామి రెండు చేతుల్ని పుచ్చుకున్నాడు.

రాంసామి ఒక్క నిమిషం ఆలో చనలో పడ్డాడు. మానాపురం అక్కడికి మూడు మైళ్ళు ఉంది. వైద్యుడు రాకపోతే — అమ్మగారు చచ్చిపోతే — మరి ఆలోచించలేకపోయాడు. ధర్మకర్త సహనం కూడా చచ్చిపోయింది.

"రాంసామీ! ఆలోచించినా, ఆలస్యం చేసినా ఆవిడ దక్కదు. ఆపైన నేనూ దక్కను!"

"అయ్యో!"

"ఏమిటి?"

"ఆ బ్యాటీ ఇట్టా ఇవ్వండి. వెళ్ళొస్తా."


ఒక్క త్రుటికాలం ధర్మకర్త మాట్లాడలేదు. గొడుగు, టార్చి లైట్ ఆయన చేతుల్లో మరింత బిగుసుకుపోయాయి.

"కన్నూ కాలూ ఉన్నవాడివి. చీకట్లో చిరతపులిలా దూసుకుపో గలవు. ఇవి లేకపోతే నేను కాలు తీసి కాలు పెట్టలేను."

రాంసామి గూడు వేసుకుందామని వెతికాడు. ఒక్క గోతాము ధర్మకర్త ఇంటి దగ్గరే ఉండిపోయింది. హేమకి కప్పిన దుప్పటి మాత్రం ఉంది. దాన్నే లాగి తలమీద కప్పుకుని రాంసామి చీకట్లో దూసుకు వెళ్ళాడు. ధర్మకర్త మరో నిమిషం అక్కడే ఉండి తడిక దగ్గరగా వేసి ఇంటికి బయలుదేరాడు. చిన్నారి హేమ చలికి మరింత మునగ దీసుకుని పడుకుంది.

మానాపురం నంచి కట్టు వైద్యుడు రాంసామి చెప్పింది విని ఆదుర్దా పడ్డాడు. ఇంత పెద్ద కేసుని చేజార నీయకూడ దనుకున్నాడు. ఈ కేసు నయం చేస్తే చుట్టూ పది ఊళ్ళలో తన కెదురు ఉండదని ఆశ పడ్డాడు. వానకూడా వెలిసింది. సైకిల్ మీద ప్రయాణ మవుతూ వైద్యుడు—"రాంసామీ! నిమిషం మీద బాబుగారింట్లో వాలతాను. నువు నెమ్మదిగా వెనకాల రా!" అంటూ రయ్యిన వెళ్ళిపోయాడు.

రాంసామి ఇంటి ముఖం పట్టాడు. అతని మనస్సు శూన్యమ్మై పోయింది.



చిత్రం — చంద్ర

ఎలాంటి ఆలోచనా రావడం లేదు. నరాలు తోడుకుపోతున్నాయి. తన మీద తనకే తెలీని విరక్తి పుడుతూంది.

వాన వెలిసినా, ఉరుములు మెరుములు తగ్గలేదు. పొలాలు, డొంకలు ఒకటే సముద్రంలా ఉన్నాయి. రాంసామి డొంక వదిలి పొలాలకు అడ్డంపడి అడ్డదారి తొక్కాడు. తోట దగ్గరికి వచ్చేస్తున్నాడు. ఇంతలో ఫెళ ఫెళ మని పిడుగు పడింది. అది తన గుడిసె మీదే పడిందని భ్రమించాడు. పరుగు తీశాడు. "హేమా, హేమా" అంటూ చావుకేకలు పెడుతున్నాడు. ధర్మకర్తగారి సొంత చేను దాటితే దేవుడి మాన్యం. ధర్మకర్త చేనుకి అడ్డం పడ్డాడు. ముళ్ళు, రాళ్ళు గమ నించ లేదు. దారి తప్పాడు. ఆ చేలో దిగుడు బావి ఉందని ఆ నిర్భాగ్యుడు మరిచిపోయాడు. "హేమా, హేమా!" అంటూ అరుస్తూనే దిగుడు బావిలో పడిపోయాడు. అతని ఆఖరి కేక, ఊపిరీ దిగుడు బావిలోనే కలిసి పోయాయి.

మర్నాడు ఉదయం ధర్మకర్త ఇంట్లో పండంటి మగబిడ్డ పుట్టాడు. ఆ సాయంత్రం రాంసామి శవానికి పంచాయతీ జరిగింది. ఊళ్ళోవాళ్ళతో పాటు ధర్మకర్త రాంసామి శవం వెంట వల్లకాటికి వచ్చాడు. స్వయంగా దగ్గర ఉండి దహన క్రియలు జరిపిం చాడు. ఆ రోజంతా హేమ ఏడ్చి ఏడ్చి, అలిసి సొలిసి ధర్మకర్త భుజంమీదే పడి ఉంది. ధర్మకర్త చాలా దుఃఖంలో మునిగిపోయారని ఊళ్ళో వాళ్ళు పదే పదే చెప్పుకున్నారు.

"బాబుగారూ! వాడు నూకలు చెల్లి వెళ్ళిపోయాడు. వాడికీ, మీకూ ఉన్న బంధం చెప్పరానిది. ఈ పసి ముండ మీ పాల పడింది. మీరే దిక్కు!" అన్నా రెవరో వల్లకాటివద్ద.

"రాంసామి ప్రాణానికి ప్రాణం ఇచ్చే స్నేహితుడు. అంతా అతనితోనే వెళ్ళిపోయింది. మమకారం పెంచు కుంటే తెంచుకోలేం. అశాశ్వతమ్మైన ఈ జన్మకి బంధాలు, అనుబంధాలు పెంచుకోలేను'' అని చెప్పాడు ధర్మ కర్త.

తరవాత కొద్ది రోజులకే ఎవరి పుణ్యానో హేమ అనాథ శరణాల యంలో పడింది. ఊళ్ళో వాళ్ళు రాంసామికి, ధర్మకర్తకి ఉన్న స్నేహం గురించే ముచ్చటిస్తారు గాని రాంసామి దిక్కుమాలిన చావుని గురించి ఒక్క మాటా అనరు. ★